

వీరవల్లిలో 22 ఎకరాల విజయ డెయిరీ సువిశాల నూతన ప్రాంగణం

విజయ భేరి

వీరవల్లిలో విజయా డెయిరీ సరికొత్త ఆటోమేషన్ మిల్క్‌ప్లాంట్

- 22 ఎకరాల్లో రూ.180 కోట్లతో అత్యాధునికంగా నిర్మాణం
- పూర్తిగా సాంకేతిక, యాంత్రీకరణతో ఏర్పాటు
- పాలతో పాటు పాల ఆధారిత ఉత్పత్తులెన్నో..
- అమూల్ పోటీకి నిలబడి పైచేయి సాధించిన సంస్థ
- ప్రభుత్వ ప్రతిబంధకాలను తట్టుకుని ముందుకు..
- ప్రస్తుతం 10.01 కోట్ల లీటర్ల పాలసేకరణ.. రూ.1,106 కోట్ల టర్నోవర్
- రూ.180 కోట్ల లాభంతో అంచెలంచెలుగా అభివృద్ధి

స్థానిక పాల డెయిరీల మనుగడను ప్రశ్నార్థకం చేస్తున్న ప్రభుత్వ విధానాలను తట్టుకుని 'విజయ' భేరి నిరంతరాయంగా మోగుతూనే ఉంది. ప్రభుత్వ సహకారంతో సాగుతున్న అమూల్ వంటి స్థానికేతర డెయిరీలతో పోటీ పడుతూ ఉక్కు సంకల్పంతో ముందుకు సాగుతోంది. నిన్నటివరకు చిట్టినగర్‌లోని పాలఫ్యాక్టరీ ద్వారా విశేష ఖ్యాతిని ఆర్జించిన 'విజయా'.. వీరవల్లిలో కొత్తగా ఏర్పాటుచేసిన ఆటోమేషన్ టెక్నాలజీతో కూడిన మిల్క్ ప్లాంట్ ద్వారా మరింత ఎత్తుకు ఎదిగింది. 22 ఎకరాల విస్తీర్ణంలో రూ.180 కోట్లతో ఈ నవ స్వయంచాలక (ఆటోమేషన్) మిల్క్‌ప్లాంట్ నిర్మాణం ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న డెయిరీల చూపు 'విజయా'పై పడింది. అత్యాధునికంగా కంప్యూటర్ ఆధారిత సాంకేతిక, యాంత్రీకరణతో పనిచేసే ఈ ప్లాంట్‌ను శనివారం 'ఆంధ్రజ్యోతి' పరిశీలించింది. ఆ వివరాలు..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఆటోమేషన్ మిల్క్‌ప్లాంట్ ఏర్పాటు ద్వారా విజయా డెయిరీ దేశవ్యాప్తంగా ఎంతో పేరు సంపాదించింది. అమూల్ వంటి స్థానికేతర డెయిరీలకు పెద్దపీట వేస్తున్న ప్రభుత్వ ప్రోత్సాహక విధానాల పరంపరలో కూడా విజయా చెక్కు చెదరకుండా ముందుకు సాగుతోంది. అమూల్ కోసం గ్రామగ్రామాన బలవంతంగా పాలసేకరణ జరిపిస్తున్న ప్రభుత్వ నిర్బంధాలను దాటుకుని అభివృద్ధి చెందటం కృష్ణామిల్క్ యూనియన్‌కే సాధ్యమైంది. కృష్ణాజిల్లా వీరవల్లిలో 16వ నెంబరు జాతీయ రహదారికి అత్యంత సమీపాన 22.2 ఎకరాల్లో ఈ ఆటోమేషన్ మిల్క్‌ప్లాంట్‌ను విజయా డెయిరీ ఏర్పాటు చేసింది. దేశంలోనే అత్యంత అడ్వాన్సుడు టెక్నాలజీతో కూడిన ఈ ప్లాంట్‌ను రూ.181 కోట్లతో ఏర్పాటు చేశారు. దీనిద్వారా విజయా డెయిరీ తన నెట్‌వర్క్‌ను మరింత వేగంగా పెంచుకోవటానికి దోహదపడుతుంది. గోదావరి, కృష్ణా జిల్లాల్లోని మారుమూల ప్రాంతాలకు కూడా చాలా వేగంగా పాల సేకరణ, ఉత్పత్తులు పంపిణీ చేసే ఆస్కారం ఏర్పడుతుంది.

మిల్క్‌ప్లాంట్ ప్రత్యేకతలివీ..

ఆటోమేషన్ మిల్క్‌ప్లాంట్ పూర్తిగా కంప్యూటర్ ఆధారిత ఆధునిక సాంకేతిక, యాంత్రీకరణ ద్వారా పనిచేస్తుంది. ఇది రెండు డివిజన్లుగా ఉంటుంది. మొదటిది యుటిలిటీ డివిజన్. రెండోది ప్రొడ్యూస్ డివిజన్. ఆటోమేషన్ ప్లాంట్‌కు అవసరమైన పవర్, ఎలక్ట్రిక్, బాయిలర్ తదితర విభాగాలు యుటిలిటీలో ఉంటాయి. ప్రధానమైన ప్రొడ్యూస్ డివిజన్‌లోనే ఆటోమేషన్ ప్లాంట్ ఉంటుంది. ఈ ప్లాంట్‌లో ప్రస్తుతం నాలుగు లక్షల లీటర్ల పాలను సంగ్రహిస్తుంది. మూడు లక్షల లీటర్ల లిక్విడిటీ ప్రొడక్ట్స్ (లస్సీ, బటర్‌మిల్క్), లక్ష లీటర్ల పెరుగు ఉత్పత్తులను నిర్వహిస్తోంది. ఈ ఉత్పాదకతలను ఆరు లక్షల లీటర్ల వరకు కూడా తీసుకెళ్లవచ్చు. ఈ ప్లాంట్ అంతా కంట్రోల్ రూమ్‌లోని కంప్యూటర్ ఆధారిత వ్యవస్థ ద్వారా పనిచేస్తుంది. స్కాడా వ్యవస్థ ద్వారా కంప్యూటర్ ప్రోగ్రామింగ్ విధానంలో పాలను ఫిల్లింగ్, పంపింగ్ వంటివి చేస్తుంటారు. ఏ ఉత్పాదకత జరగాలన్నా కంట్రోల్ రూమ్ నుంచి ఆదేశాలు రావాల్సిందే. వాహనాల నుంచి పాలను డాక్ యూనిట్ ద్వారా సంగ్రహించి వాటిని ఫ్యాక్టరీ దక్షిణ దిశలో ఉన్న మిల్క్ స్టోరేజ్ ట్యాంకర్లలోకి పంపిస్తారు. లక్ష లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంకర్లు మూడు, అరలక్ష లీటర్ల సామర్థ్యం కలిగిన ట్యాంకర్లు ఏడు ఉన్నాయి. పాల ఉత్పత్తులు తయారుచేసే ముందు ట్యాంకర్లలోని పాలలో ఉన్న వైరస్‌ను చంపటానికి 80 డిగ్రీల ఉష్ణోగ్రతలో వేడి చేస్తారు. ఆ తర్వాత నిర్దేశిత ఫ్యాట్ కంటే ఎక్కువ ఉంటే తొలగిస్తారు. ఇలా చేసిన పాలను పాల ప్యాకెట్లు, పెరుగు, మజ్జిగ, లస్సీలు చేయటానికి పంపిస్తారు. పాల ప్యాకెట్లను తయారు చేయటం కోసం మిల్క్ పౌచ్ ఫిల్లింగ్ స్టేషన్‌లోకి పంపిస్తారు. ఇక్కడ కంప్యూటర్ ఆధారిత విధానంలో పనిచేసే 150 ఎంఎల్, 160 ఎంఎల్, 500 ఎంఎల్ వంటి ప్యాకింగ్ యంత్రాలు ఉంటాయి. కప్ కర్డ్ ఫిల్లింగ్ స్టేషన్‌లోకి పాలను పంపించి బాగా వేడి చేస్తారు.

- మిగతా 6లో

రైతులకు రూ.200 కోట్ల ఆస్తి



నూతన ప్లాంట్ కృష్ణాజిల్లా పాడి రైతులకు 200 కోట్ల రూపాయల ఆస్తి. కరోనాతో ప్రపంచమంతా వణికిపోతున్న సమయంలో విజయా డెయిరీ ఈ విజయాన్ని సాధించింది. ఇది రైతుల విజయంగా భావిస్తున్నాం. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించేందుకు ఇది సోపానంగా నిలుస్తుందని నమ్ముతున్నాం.

- చలసాని ఆంజనేయులు, డెయిరీ చైర్మన్






సిబ్బంది లేకుండా పనిచేసే యంత్రాలు (ఇన్‌సెట్‌లో) అధునాతన టెస్టింగ్ ల్యాబ్

- వర్షాలు కురిసినప్పుడో, వరదలు వచ్చినప్పుడో ప్రకాశం బ్యారేజీ గేట్లు ఎత్తినప్పుడు కాల్వల ద్వారా నీరు వృథాగా సముద్రంలోకి చేరుతోంది. ఎండకాలంలోనో, నీటి ఎద్దడి సమయంలోనో ఎగువ నుంచి నీటి విడుదల లేనప్పుడు మాత్రం కాల్వలు ఎండిపోతున్నాయి. ఈ సమస్య పరిష్కరించడానికి అసలు కాల్వలపై చెక్‌డ్యామ్‌లను నిర్మించే ప్రతిపాదనలు చేయొచ్చు కదా? కొద్దినెలల క్రితం జరిగిన నీటిపారుదల సలహా మండలి సమావేశంలో కొందరు రైతులు అడిగిన ప్రశ్న ఇది.

- నీటి వనరులను పొదుపుగా ఉపయోగించుకోవడానికి ఇతర రాష్ట్రాల్లో కాల్వలపై చెక్‌డ్యామ్‌లు కనిపిస్తాయి. మనం ఎందుకు నిర్మించకూడదు? ఇది ఓ ప్రజాప్రతినిధి ప్రశ్న.

..చెంతనే కృష్ణమ్మ ప్రవహిస్తున్నా ఉమ్మడి జిల్లాకు నీటి ఎద్దడి తప్పడం లేదు. నీటి విషయంలో జిల్లా పరిస్థితి అతివృష్టి, అనావృష్టిగా మారింది. వర్షాలు విస్తారంగా కురిసి, ఎగువ నుంచి నీరు విడుదల చేస్తే దాన్ని పొదుపు చేసుకోలేని పరిస్థితి. ఈ సమస్యకు పరిష్కారం చెక్‌డ్యామ్‌ల నిర్మాణమే అని తెలుస్తున్నా అధికారులు కనీస ఆలోచనలు కూడా చేయట్లేదు.

నీటి సమస్యకు చెక్ పెట్టలేరా



రెండు జిల్లాల్లో కాల్వలపై చెక్‌డ్యామ్‌ల నిర్మాణం అత్యవసరం

వర్షాకాలంలో ప్రకాశం బ్యారేజీ నుంచి వృథాగా పోతున్న నీరు

- వేసవిలో చుక్కనీరు లేక అన్నదాతల అవస్థలు
- కాల్వలపై చెక్‌డ్యామ్‌లు నిర్మించాలని రైతుల డిమాండ్
- ఐఏబీ సమావేశాల్లో నీటి సంఘాల అభిప్రాయం కూడా అదే
- పట్టించుకోని జలవనరుల శాఖ అధికారులు

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : వర్షాభావ పరిస్థితులు తీవ్రరూపం దాల్చినప్పుడు ఇరు జిల్లాల్లో నీటి విడుదల కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇలాంటి పరిస్థితుల నుంచి తప్పించుకుని నీటి నిల్వలను పెంచుకునే చెక్‌డ్యామ్‌ల గురించి జలవనరుల శాఖ అధికారులు ఇప్పటి వరకు ఆలోచనలు చేసిన పరిస్థితులు లేవు. నీటిపారుదల సలహా మండలి సమావేశాల్లో రైతులు వాటి గురించి ప్రశ్నించినప్పుడు మాత్రం 'ఆలోచిస్తాం..' అనే సమాధానం చెబుతున్నారు. ఆ తర్వాత చెక్‌డ్యామ్‌ల గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు.

ఇదీ పరిస్థితి

కృష్ణా తూర్పు ప్రధాన కాల్వ మూడు భాగాలు విడిపోయి బందరు, ఏలూరు, రైవస్‌గా దిగువకు ప్రవహిస్తుంది. అక్కడి నుంచి ఉప కాల్వలుగా విడిపోయి స్థానిక నామకరణాలతో ప్రవహిస్తాయి. ఎన్టీఆర్ జిల్లాలో తాగు, సాగునీటి అవసరాలకు సాగర్ కాల్వలు ప్రధానమైతే, కృష్ణాజిల్లాకు ఈ కాల్వలే సాగు, తాగునీటిని అందజేస్తాయి. తూర్పుడెల్టా కింద 6లక్షల78వేల531 ఎకరాల ఆయకట్టు ఉంది. ఇదికాకుండా పొరుగున ఉన్న పశ్చిమగోదావరి జిల్లాలో 58 వేల ఆయకట్టు సాగుతోంది. వెరసి 7లక్షల36వేల531 ఎకరాల ఆయకట్టు ఉంది. బందరు, ఏలూరు, రైవస్ కాల్వల ద్వారా మొత్తం ఆయకట్టుకు సాగునీరు ప్రవహిస్తోంది. తాగునీటి అవసరాలకు ఈ కాల్వలు ప్రధానం. బందరు కాల్వ 39.6 కిలోమీటర్లు ఉండగా, రైవస్ కాల్వ 57.70 కిలోమీటర్లు, ఏలూరు కాల్వ 50.07 కిలోమీటర్లు పొడవు ఉంది. వాటితో పాటు ఉప కాల్వలపై చెక్‌డ్యామ్‌లను నిర్మించవచ్చని జలవనరుల నిపుణులు చెబుతున్నారు. ఒక్కో కాల్వపై 4.6 కిలోమీటర్ల దూరంతో చెక్ డ్యామ్‌లను నిర్మించు కునే అవకాశం ఉందని స్పష్టం చేస్తున్నారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా రబీకి నీరు ఇవ్వలేదు. జలవనరుల శాఖ అధికారులు ప్రస్తుతం ఉన్న నీటి ఎద్దడిని దృష్టిలో పెట్టుకుని చెక్ డ్యామ్‌లను నిర్మించాలని రైతులు కోరుతున్నారు.

ఇలా చేస్తే మేలు

కాల్వలు, ఉపకాల్వలపై చెక్‌డ్యామ్‌లను నిర్మించడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. వేగంగా జరిగే నీటి ప్రవాహాన్ని ఇవి నియంత్రిస్తాయి. నీటిని పొదుపు చేసుకోవడానికి సులభమైనవి. తక్కువ ఖర్చుతో అక్కడి భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా నిర్మించుకోవచ్చు. తెలంగాణలోని సాగునీటి కాల్వలపై ఎటుచూసినా చెక్‌డ్యామ్‌లు కనిపిస్తాయి. ఇలా చేశాక అక్కడ సాగునీటి కొరత తీరిందని నిపుణులు చెబుతున్నారు. ఈ డ్యామ్‌లను నిర్మించడం వ్యవసాయానికి ఎంతో ఉపయోగకరం. వీటి నిర్మాణానికి నిపుణులు కొత్త టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొచ్చారు. వాటి నిర్మాణం వల్ల నీటి వృథా తగ్గుతుంది. పైగా రెండు చెక్‌డ్యామ్‌ల మధ్య నీరు ఏడాది పొడవునా నిల్వ ఉంటుంది. దీనివల్ల ఆ సమీప ప్రాంతంలో భూగర్భ జలాలు పెరుగుతాయి. వర్షాభావ పరిస్థితులు ఉత్పన్నమైనప్పుడు ఈ నీటిని ఉప యోగించుకోవచ్చని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

మైలవరం వైసీపీ ఖాళీ

టీడీపీ తీర్థం పుచ్చుకున్న ఎమ్మెల్యే వసంత



పార్టీ కండువా కప్పి ఎమ్మెల్యే వసంతను ఆహ్వానిస్తున్న టీడీపీ అధినేత చంద్రబాబు

- ఆయన వెంట భారీగా చేరిన అనుచరులు
- ఇబ్రహీంపట్నం ఎంపీపీతో పాటు భారీగా చేరికలు
- ఇద్దరు వైస్ ఎంపీపీలు, 12 మంది సర్పంచులు కూడా..

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : మైలవరం నియోజకవర్గంలో వైసీపీ కేడర్ దాదాపు ఖాళీ అయ్యింది. వసంత కృష్ణప్రసాద్‌తో పాటు ఇబ్రహీంపట్నం ఎంపీపీ, మరో ఇద్దరు వైస్ ఎంపీపీలు, 12 మంది సర్పంచులు, ఏడుగురు సొసైటీ అధ్యక్షులు, ఇద్దరు మండల పార్టీ అధ్యక్షులు, ఇద్దరు కౌన్సిలర్లు, ఇద్దరు వార్డు సభ్యులు శనివారం హైదరాబాద్‌లో టీడీపీలో చేరారు. దీంతో మైలవరంలో వైసీపీ కేడర్ దాదాపు కనుమరుగైంది.

భారీగా చేరికలు

మైలవరం మండలం నుంచి.. మండల పరిషత్ ఉపాధ్యక్షుడు షేక్ అబ్దుల్ రహీం, కీర్తిరాయునిగూడెం ఎంపీటీసీ భూక్యా అయ్యా, వైసీపీ మైలవరం మండల మైనారిటీ సెల్ అధ్యక్షుడు షేక్ నన్నే బాబు, జిల్లా బీసీ కమిటీ సభ్యుడు వేముల దుర్గారావు, వైసీపీ చంద్రగూడెం అధ్యక్షుడు దేవరకొండ ఆంజనేయులు, ప్రత్తిపాటి కిరణ్ టీడీపీలో చేరారు. రెడ్డిగూడెం మండలం నుంచి.. శ్రీరాంపురం సర్పంచి అట్లూరి శ్రీనివాస రావు, నేలపట్ల అంబికా నాగరాజు, చిన్ని తిరుపతిరావు, చిన్ని వలరాజు, చిన్ని రామారావు, వైసీపీ సీనియర్ నాయకులు మౌనికల సాంబశివరావు, పటాపంచల రామారావు, పూల కోటేశ్వరరావు, మడిమల నాగేశ్వరరావు, కొండపల్లి సురేశ్, పూల వెంకటేశ్వరరావు, చామకూర దుర్గాప్రసాద్ తదితరులు టీడీపీ కండువా కప్పుకొన్నారు. ఇబ్రహీంపట్నం మండలం నుంచి.. ఇబ్రహీంపట్నం ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న దుర్గాప్రసాద్, వైస్ ఎంపీపీ-1 బండి నాగమణి, తుమ్మలపాలెం సర్పంచి బొమ్ము వెంకటరమణ, జూపూడి సర్పంచి కాకి దేవమాత, మూలపాడు పీఏసీఎస్ చైర్మన్ గొరినేని గాంధీ, వాసిరెడ్డి హరినాథ్, లంకె గోవిందరాజులు, చెరుకుమల్లి తిరుపతిరావు, చింతల చిట్టిబాబు, చెరుకుమల్లి సీతారామాంజనేయులు, కొక్కిలిగడ్డ నాగరాజు, పోలగంగు రాణి, కొండపల్లి మున్సిపాలిటీ కౌన్సిలర్లు షేక్ రసూల్, దామెర్ల శ్రీలక్ష్మి తదితరులు టీడీపీలో చేరారు. జి.కొండూరు మండలం నుంచి.. వైసీపీ మండల అధ్యక్షుడు నెల్లూరు లీలా శ్రీనివాస్, కందులపాడు సర్పంచి నెల్లూరు శ్రీదేవి, సూదిరెడ్డి సురేశ్, గార్లపాటి వెంకట్రావు, విజయవాడ రూరల్ నుంచి.. మండల వైసీపీ అధ్యక్షుడు కాటంనేని పూర్ణచంద్రరావు, ముప్పాళ్ల చైతన్యకుమార్, పెద్ది రాంబాయమ్మ, వెలగలేరు వైసీపీ మాజీ అధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ చల్లగుంట అజయ్‌కుమార్ తదితరులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు.

జిల్లా టీబీ ఆసుపత్రిలో పరిపాలన గాడితప్పింది. ఎలాంటి ఉత్తర్వులు లేకుండా ఈ ఆసుపత్రిలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు పరిపాలన యావత్తును తమ చేతుల్లోకి తీసుకుని తమదైన శైలిలో వ్యవహరిస్తున్నారు. ఇక్కడ పనిచేసే వైద్యులతో కూడా పనిలేకుండా పరిపాలనాపరమైన అంశాల్లో అనధికారికంగా వీరు నిర్ణయాలు తీసుకోవడం వివాదాస్పదమవుతోంది.

టీబీ ఆసుపత్రిలో ఇదేం రోగం..?



మచిలీపట్నంలోని టీబీ ఆసుపత్రి

అనధికారికంగా పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగుల జోక్యం

- పెడన, చల్లపల్లిలో చేయాల్సిన పనిని పక్కనపెట్టి ఇక్కడ పెత్తనం

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నం టీబీ ఆసుపత్రిలోని కార్యాలయంలో సరిపడా ఉద్యోగులు ఉన్నారు. అయినా పెడన, చల్లపల్లి ప్రాంతాల్లో పనిచేసే ఉద్యోగులు ఎలాంటి ఆదేశాలు లేకుండా ఇక్కడ పనిచేస్తుండటం గమనార్హం. వీరికి డెప్యుటేషన్‌పై పనిచేసేలా ఆదేశాలు కూడా లేవు. అయినా ఈ ఇద్దరు ఉద్యోగులు టీబీ ఆసుపత్రిలో విధులకు హాజరవుతూ ముఖ ఆధారిత హాజరును ప్రతిరోజూ వేస్తున్నారు. ఒక ఉద్యోగి హాజరుపట్టీలో ఇక్కడే పనిచేస్తున్నట్లుగా సంతకాలు కూడా చేస్తున్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ట్రీట్‌మెంట్ హెల్త్ విజిటర్లు ఉన్నా చల్లపల్లి, పెడన ప్రాంతాల్లో పనిచేస్తున్న ఇద్దరు ఉద్యోగులను మచిలీపట్నం టీబీ ఆసుపత్రిలో పనిచేయించుకోవడం వెనుక బలమైన కారణాలు ఏమిటనేది అర్థం కాకుండా ఉంది.

విధుల్లో నిర్లక్ష్యం

అవనిగడ్డ, చల్లపల్లి, పెడన పరిసర మండలాల్లో ప్రాంతాల్లో టీబీ రోగులపై పర్యవేక్షణ కొరవడింది. దీంతో ఆ వ్యాధి నుంచి కోలుకోవడంలో పెడన, చల్లపల్లి ప్రాంతాలు అట్టడుగు స్థానంలో ఉన్నాయి. పెడనలో పనిచేయాల్సిన ఉద్యోగి ఒకరు తన విధులను పక్కనపెట్టి ఒక వైద్యుడిని ఆసుపత్రికి తీసుకురావడం, ఆయన డ్యూటీ ముగిశాక బస్టాండ్‌లో దింపిరావడం వంటి పనులు చేస్తూ అసలు ఉద్యోగాన్ని పక్కన పెట్టేయడం గమనించదగ్గ అంశం. టీబీ ఆసుపత్రిలో డేటా ఎంట్రీ ఆపరేటర్, టీబీహెచ్‌వీ పోస్టుల్లో రెగ్యులర్ ఉద్యోగులు ఉన్నా వారి స్థానంలో చల్లపల్లి, పెడన ప్రాంతాల నుంచి ఉద్యోగులను ఇక్కడ అనధికారికంగా పనిచేయించడం గమనార్హం

ఐసీఎంఆర్ పోస్టుల నియామకంలోనూ చేతివాటం

క్షయవ్యాధి నివారణ కోసం కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న చర్యలను, వస్తున్న ఫలితాలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ఆంధ్రప్రదేశ్‌లో కృష్ణాజిల్లాను పైలెట్ ప్రాజెక్టు కింద ఇటీవల ఎంపిక చేసింది. ఇందుకోసం ఒక వైద్యుడితో పాటు మరో ఆరుగురు ఉద్యోగులతో ప్రత్యేక వైద్యబృందాన్ని ఐసీఎంఆర్ ద్వారా నియమించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉద్యోగుల ఎంపికలో ఇంటర్వ్యూకు వచ్చిన వారితో ఈ ఉద్యోగులు నేరుగా బేరం మాట్లాడి నగదు ఇచ్చిన వారినే నియమిస్తామని తెగేసి చెప్పడంతో విషయం బయటకు వచ్చింది. లోతుగా విచారణ చేస్తే మరిన్ని అంశాలు వెల్లడవుతాయని టీబీ విభాగంలో పనిచేసే ఉద్యోగులు అంటున్నారు.

పని ఒత్తిడి కారణంగానే తెచ్చాం..

మచిలీపట్నం టీబీ ఆసుపత్రిలో చల్లపల్లిలో పనిచేసే ఒక ఉద్యోగిని వివిధ పనుల కోసం ఉపయోగించుకుంటున్నాం. పని ఒత్తిడి కారణంగా ఈ ఉద్యోగిని కార్యాలయంలో పరిరిపాలనా పరమైన పనులు చేసేందుకు వినియోగించుకుంటున్నాం.

- వెంకట్రావ్, టీబీ ఆసుపత్రి వైద్యాధికారి

నేడే పల్స్ పోలియో

- 1.39 లక్షల చిన్నారుల కోసం 1.85 లక్షల డోసులు సిద్ధం



నాగాయలంక సెంటర్‌లో పల్స్ పోలియో అవగాహన ర్యాలీ

- 6లో..

7న పెదపూడిలో ప్రజాగళం

విజయవంతం చేయాలని టీడీపీ జిల్లా నేతల పిలుపు



సభాస్థలం వద్ద టీడీపీ కృష్ణాజిల్లా నేతలు

7న పెదపూడిలో ప్రజాగళం

విజయవంతం చేయాలని టీడీపీ కృష్ణాజిల్లా నేతల పిలుపు

కూచిపూడి, మార్చి 2: పామర్రు నియోజకవర్గ పరిధిలోని పెదపూడిలో ఈనెల 7వ తేదీ మధ్యాహ్నం ప్రజాగళం సభను నిర్వహిస్తున్నామని టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొంటారని, విజయవంతం చేయాలని ఆ పార్టీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణరావు, పొలిట్‌బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. శనివారం సభ నిర్వహించే ప్రాంతాన్ని వారు పరిశీలించారు. పార్టీలకతీతకంగా తటస్థుల సమస్యలను చంద్రబాబు తెలుసుకుంటారని, అధికారంలోకి వచ్చాక వాటిని పరిష్కరించడానికే ఈసభ నిర్వహిస్తున్నామని కొనకళ్ల నారాయణ తెలిపారు. ప్రజలు, రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు, స్త్రీలు పడుతున్న ఇబ్బందులు, అన్నివర్గాల సమస్యలు తెలుసుకుని వాటిని చంద్రబాబుకు వివరిస్తామని తెలిపారు. కొంతమందితో నేరుగా చంద్రబాబు ముచ్చటిస్తారన్నారు. అవినీతి, అరాచక ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం సభలో టీడీపీ- జనసేన ఉమ్మడి కార్యాచరణ ప్రకటించినట్లు పేర్కొన్నారు. పామర్రు, గుడివాడ, పెడన, బందరుతోపాటు పక్క నియోజకవర్గాల ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. 6వేల మంది ప్రతినిధులతో సభ నిర్వహిస్తున్నామని రవీంద్ర తెలిపారు. ప్రజాగళం సభ విజయవంతానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని టీడీపీ పామర్రు నియోజకవర్గ ఇన్‌చార్జి వర్ల కుమార్‌రాజా కోరారు. నన్నప నేని వీరేంద్ర, లింగమనేని రామలింగేశ్వర రావు, తలశిల స్వర్ణలత పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణలో ప్రవర్తనా నియమావళి కీలకం

అధికారుల శిక్షణలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

వన్‌టౌన్, మార్చి 2: ఎన్నికలను స్వేచ్ఛగా, నిజాయితీగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రవర్తనా నియమావళి కీలకంగా వ్యవహరిస్తుందని ఎన్నికల అధికారి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. రానున్న సాధారణ ఎన్నికల్లో గ్రామ, పట్టణ, నగరస్థాయిలో పర్యవేక్షకులుగా వ్యవహరించే ఎంపీడీవోలు, మునిసిపల్ జోనల్ కమిషనర్లకు ప్రవర్తనా నియమావళిపై శనివారం పింగళి వెంకయ్య స్పందన సమావేశ మందిరంలో నిర్వహించిన అవగాహన, శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తేదీ నుంచి ప్రక్రియ పూర్తయ్యేంత వరకు ప్రవర్తనా నియమావళి అమలులో ఉంటుందన్నారు. అధికారులు ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నియమనిబంధనలు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల సంఘం నిర్ణయించిన మేరకే అభ్యర్థుల వ్యయం ఉండాలని, రికార్డును సక్రమంగా నిర్వహించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. దేవాలయాలు, చర్చిలు, మసీదులను ఎన్నికల ప్రచారానికి వినియోగించకూడదన్నారు. ప్రైవేట్ భవనాల యాజమానుల అనుమతి లేకుండా పోస్టర్లు అంటించడం, రాయడం చేయకూడదన్నారు. పార్టీ ప్రచారానికి ముద్రించే కరపత్రం పోస్టర్లపై ప్రచురణకర్త పేరు, చిరునామా తప్పనిసరిగా ఉండాలన్నారు. ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియాలో ప్రచారం చేసే అభ్యర్థులు మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీ సర్టిఫికెట్లను తీసుకోవాలన్నారు. వార్తా పత్రికల్లో పెయిడ్ వార్తలను గుర్తించి చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక అధికారుల అనుమతులు లేకుండా పార్టీలు కానీ, అభ్యర్థి గాని బహిరంగ సమావేశాలు నిర్వహించకూడదన్నారు. నామినేషన్ దాఖలు సమయంలో వాహనాల పరిమితి నిబంధనను అమలు చేయాలన్నారు. ప్రజలను ప్రభావితం చేసే దేశ, రాష్ట్ర, స్థానిక నాయకుల విగ్రహాలను కప్పి ఉంచాలన్నారు. కొత్త పథకాల ప్రకటన, ప్రాజెక్టుల శంకుస్థాపన, కొత్త పనుల మంజూరు, ఆర్థిక గ్రాంట్లు ప్రకటించడం చేయరాదన్నారు. మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీఆర్వో వి.శ్రీనివాసరావు, ఆర్డీవోలు బీహెచ్ భవానీశంకర్, కె.మాధవి, ఆర్.రవీంద్రరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి పాల్గొన్నారు.

ఓటర్ల దరఖాస్తులు సత్వరమే పరిష్కరించండి

అధికారులకు కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రాజాబాబు

మచిలీపట్నం, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): తుది ఓటర్ల జాబితాలు ప్రకటించిన అనంతరం కృష్ణాజిల్లాలో ఓటర్లుగా చేరేందుకు, మార్పులు, చేర్పుల కోసం వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశించారు. జేసీ గీతాంజలిశర్మతో కలిసి ఎన్నికల అధికారులు, రాజకీయ పార్టీల నాయకులతో శనివారం కలెక్టరేట్‌లోని స్పందన సమావేశపుహాలులో ఆయన సమావేశం నిర్వహించారు. ఈఏడాది జనవరి 22వ తేదీన తుది ఓటర్లజాబితా ప్రకటించిన అనంతరం జిల్లాలో ఫాం-6,7,8 దరఖాస్తులు 37,634 అందాయన్నారు. వీటిలో 24,338 అంగీకరించామని, 2,929 తిరస్కరించామని, ఇంకా 10,367 దరఖాస్తుల పరిశీలన వివిధ దశల్లో ఉందని తెలిపారు. పద్దెనిమిదేళ్లు నిండినవారు నూతన ఓటర్లుగా నమోదయ్యేందుకు ఇంకా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జిల్లాలో వివిధ పోలింగ్ స్టేషన్ల మార్పుకోసం వచ్చిన ప్రతిపాదనలను ఎన్నికల సంఘం ఆమోదం కోసం పంపినట్లు తెలిపారు. డీఆర్వో కె.చంద్రశేఖరరావు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఆర్వోలు, ఏఈఆర్వోలు పాల్గొన్నారు.

సురక్ష క్యాంపుల నిర్వహణలో కృష్ణాకు ప్రథమస్థానం

రెండో విడత ఆరోగ్య సురక్ష క్యాంపుల నిర్వహణలో కృష్ణాజిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచిందని కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి శనివారం కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రెండో విడత జిల్లాలో 236 సురక్ష క్యాంపుల్లో 1,14,594మందికి వైద్యపరీక్షలు నిర్వహించినట్లు జవహర్‌రెడ్డికి వివరించారు. జిల్లాలో మినుము, పెసర. శెనగ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని, ఆదివారం సమావేశం నిర్వహించి ఏ ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలనేది నిర్ణయిస్తామని తెలిపారు. జేసీ గీతాంజలిశర్మ, వివిధ శాఖల అధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

దుర్గమ్మ హుండీల ఆదాయం రూ.4.65 కోట్లు

వన్‌టౌన్, మార్చి 2: ఇంద్రకీలాద్రిపై కనక దుర్గమ్మకు 32 రోజులకు హుండీల్లో భక్తులు రూ.4,65,65,102 కానుకలు సమర్పించారు. దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో మహా మండపం ఆరో అంతస్థులో శనివారం హుండీల్లో కానుకలను లెక్కించారు. బంగారం 848గ్రాములు, 11 కిలోల వెండిని హుండీల్లో సమర్పించుకున్నారు. 3298 యూఎస్ డాలర్లు, 4.5 ఓమన్ రియాల్స్, 70 యూకే పౌండ్లు, 145 కెనడా డాలర్లు, 110 ఆస్ట్రేలియా డాలర్లు, 20 యూరోలు, 66 సింగ పూర్ డాలర్లు, 12 మలేషియా రింగెట్లు, 139 యూఏఈ దీర్హమ్‌లు, 1.25 కువైట్ దీనార్లు, 35 సౌదీ రియాల్స్, 3 ఖతార్ రియాల్స్‌ను భక్తులు కానుకగా వేశారు. ఈవో రామారావు, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు, పోలీసులు పాల్గొన్నారు.

సాంకేతిక శక్తిగా యువశక్తి

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు ప్రభుత్వం కృషి: ఏపీఎస్‌సీహెచ్‌ఈ వైస్‌చైర్మన్ రామ్మోహనరావు

గుడ్లవల్లేరు, మార్చి 2: దేశంలో ఉన్న యువశక్తిని సాంకేతిక, సామాజిక శక్తిగా మార్చి వారి ఉజ్వల భవిష్యత్ బాటలు వేయాలని ఏపీఎస్‌సీహెచ్‌ఈ ద్వారా ప్రభుత్వం కృషి చేస్తోందని ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి (ఏపీఎస్‌సీహెచ్‌ఈ) వైస్ చైర్మన్ కె.రామ్మోహనరావు అన్నారు. శనివారం శేషాద్రి రావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల(ఎస్ఆర్‌జీఈసీ)లో యువత సాధికారత సాధించడానికి ఉన్నత విద్యలో సంస్కరణలు అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. నాణ్యమైన విద్యకు భరోసాగా తమ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ కృషి చేస్తోందన్నారు. ఎంప్లాయబిలిటీ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చిందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణకుమార్, వైస్ ప్రిన్సిపాల్ అకడమిక్స్ డాక్టర్ ఎంఆర్‌పీహెచ్ శాస్త్రి, వైస్ ప్రిన్సిపాల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ పి.కోదండరామారావు, పీజీసీఆర్డీ డైరెక్టర్ డాక్టర్ జీవీఎస్ఎన్ఆర్వీ ప్రసాద్, యాజమాన్య సలహాదారు డాక్టర్ పొట్లూరి రవీంద్రబాబు పాల్గొన్నారు.

15 నుంచి డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్షలు

మచిలీపట్నం టౌన్, మార్చి 2: డీఎస్సీ-2024 అభ్యర్థులు ఈనెల 15 నుంచి ఆన్‌లైన్‌లో కంప్యూటర్ బేసిక్ పరీక్షలు రాయాలని కృష్ణాజిల్లా విద్యాశాఖాధికారి తాహెరా సుల్తానా ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు గంట ముందు చేరుకోవాలని, హాల్‌టికెట్‌లో ఫొటో లేకుంటే లేటెస్ట్ ఫొటోతో పాటు ఐడెంటిటీ కార్డు తీసుకుని హాజరు కావాలని సూచించారు. దివ్యాంగులు అప్లికేషన్‌లో పొందుపరచని పక్షంలో అంగవైకల్యం ధ్రువీకరణ పత్రాన్ని డీఈవోకు సమర్పించి సహాయకుని తీసుకురావచ్చన్నారు. 97008 57223, 96525 50299, 97008 82034కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకో వచ్చన్నారు.



విజయవాడలో పల్స్ పోలియో ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు

రెండు పోలియో చుక్కలతో

అంగవైకల్యాన్ని రూపుమాపుదాం

నేడు ఎన్టీఆర్ జిల్లాలో 2.48 లక్షల మంది చిన్నారులకు చుక్కల మందు

3.11 లక్షల డోసులు సిద్ధం: కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు

వన్‌టౌన్, మార్చి 2: రెండు పోలియో చుక్కలతో చిన్నారుల్లో అంగవైకల్యాన్ని రూపుమాపుదామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు పిలుపునిచ్చారు. ఈనెల 3, 4, 5 తేదీల్లో పల్స్ పోలియో సందర్భంగా జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో శనివారం పాత ప్రభుత్వాసుపత్రి వద్ద నిర్వహించిన అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఆదివారం జిల్లాలో 1,008 పల్స్ పోలియో కేంద్రాల్లో ఐదేళ్లలోపున్న 2.48 లక్షల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయనున్నామని ఆయన తెలిపారు. ఇందుకు అన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో 397, గ్రామీణ ప్రాంతాల్లో 611 పల్స్ పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో 35 కేంద్రాలు, 71 మొబైల్ యూనిట్లు ఉన్నాయన్నారు. 4,244 మంది వ్యాక్సినేటర్లు, 3,11,460 చుక్కల డోస్‌లను సిద్ధం చేసినట్లు తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు పల్స్ పోలియో చుక్కలు వేయించాలని ఆయన సూచించారు. పల్స్ పోలియో చుక్కలు వేయడం ద్వారా ఐదేళ్లలో ఎక్కడా పోలియో కేసులు నమోదు కాలేదని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి తెలిపారు. ఆదివారం ఎంపిక చేసిన కేంద్రాల్లో పోలియో చుక్కలు వేస్తారని సోమ, మంగళవారాల్లో వైద్య సిబ్బంది ఇంటింటికి తిరిగి చుక్కలు వేస్తారని మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. నగరంలో 1.50లక్షల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. విమ్స్ నర్సింగ్ విద్యార్థులు, పోలియోతో బాలిక పడే ఇబ్బందులను వీధినాటిక ద్వారా ప్రదర్శించారు. రెడ్‌క్రాస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బి.సమరం, వైద్యారోగ్యశాఖ జిల్లా అధికారిణి సుహాసిని, ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేష్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ అమృత, టీబీ కంట్రోల్ అధికారిణి డాక్టర్ ఉషారాణి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఇందుమతి, జిల్లా మలేరియా అధికారి మోతీబాబు, డీపీఎంవో డాక్టర్ నవీన్, అప్నా అధ్యక్షుడు డాక్టర్ అనమయ్య, ఐడీసీ ప్రాజెక్ట్ అధికారిణి జి.ఉమాదేవి పాల్గొన్నారు.

కృష్ణాజిల్లాలో 1.39 లక్షల చిన్నారుల కోసం

1.85 లక్షల డోసులు సిద్ధం

డీఎంహెచ్‌వో డాక్టర్ గీతాబాయి

మచిలీపట్నం టౌన్, మార్చి 2: జిల్లాలోని 1,153 పల్స్‌పోలియో కేంద్రాల్లో ఆదివారం నూరుశాతం పోలియో చుక్కలు వేసి జాతీయ పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైద్యసిబ్బందికి వైద్య ఆరోగ్యశాఖ కృష్ణాజిల్లా అధికారి డాక్టర్ జి.గీతాబాయి పిలుపునిచ్చారు. శనివారం నగరంలో నిర్వహించిన ర్యాలీని గీతాబాయి నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో 956, పట్టణ ప్రాంతాల్లో 127 పోలియో కేంద్రాలు ఏర్పాటు చేశామని ఆమె తెలిపారు. ఐదేళ్లలోపు 1,39,180 మంది పిల్లలున్నారని, వీరికి కావలసిన 1,85,240 డోసులను సిద్ధం చేశామని తెలిపారు. 62 మొబైల్ పోలియో కేంద్రాలు, 23 ట్రాన్సిట్ పోలియో బూత్‌లను ఏర్పాటు చేశామన్నారు. 4,898 మంది సిబ్బందిని ఇందుకు నియమించామన్నారు. మార్చి 3న పల్స్‌పోలియో కేంద్రం స్థాయిలో చుక్కలు వేస్తారని, 4, 5 తేదీల్లో మిగిలిపోయిన పిల్లలకు ఇంటింటికీ తిరిగి పోలియో చుక్కలు వేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ, విద్యాశాఖతో పాటు ఇతర శాఖల ఉద్యోగులు భాగస్వాములవుతారన్నారు. జిల్లాలో 158 హైరిస్క్ ప్రాంతాలైన ఇటుక బట్టీలు, క్రషర్స్‌లలో, సంచార జాతుల వారిని సర్వే చేసి గుర్తించామని, వారికీ పోలియో చుక్కలు వేస్తామన్నారు. ఈ ర్యాలీలో ఐడీవో డాక్టర్ సీతాకుమారి, డాక్టర్ నాగభవాని, వైద్యాధికారి డాక్టర్ పి. సుష్మ, నర్సింగ్ కళాశాల సిబ్బంది, అంగన్వాడీలు పాల్గొన్నారు.



మచిలీపట్నంలో పల్స్‌పోలియో ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో గీతాబాయి



కోనేరు సెంటర్‌లో కటౌట్ వద్ద ధర్నా చేస్తున్న పిప్పళ్ల సూర్యప్రకాశరావు, టీడీపీ నాయకులు

వైసీపీ కటౌట్లపై టీడీపీ నేత తండ్రి ఫొటో

కటౌట్లు తొలగించాలని కోనేరు సెంటర్‌లో టీడీపీ ధర్నా

మచిలీపట్నం టౌన్, మార్చి 2: వైసీపీ మచిలీపట్నం అభ్యర్థి పేర్ని కిట్టుతో టీడీపీ నాయకుడి తండ్రి ఫొటోను వైసీపీ కటౌట్లు, ఫ్లెక్సీలపై వేసుకోవడం ఏంటని టీడీపీ మచిలీపట్నం నగర అధ్యక్షుడు ఎండీ ఇలియాస్ పాషా ధ్వజమెత్తారు. టీడీపీ నగర కార్యదర్శి పిప్పళ్ల కాంతారావు తండ్రి సూర్యప్రకాశరావు ఫొటోను కోనేరుసెంటర్, తదితర ప్రాంతాల్లో పెట్టిన వైసీపీ కటౌట్లు, ఫ్లెక్సీల్లో వేయడంపై టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం కోనేరుసెంటర్‌లో కటౌట్ వద్ద ధర్నా చేశారు. దానిని తొలగించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో పిప్పళ్ల కాంతారావు, పిప్పళ్ల సూర్యప్రకాశరావు, కట్టా దుర్గ టీడీపీ నేతలు పాల్గొన్నారు.

వైసీపీలో ఎప్పుడు చేరావంటున్నారు

ఏడాది క్రితం పార్టీ పర్యటనలో భాగంగా మా ఇంటికి వైసీపీ మచిలీపట్నం అభ్యర్థి పేర్ని కిట్టు వచ్చారు. మేము టీ ఇస్తే కిట్టు తాగారు. ఆ సమయంలో నాతో కిట్టు మాట్లాడారు. నాకు తెలియకుండా ఫొటోలు తీశారు. నా అనుమతి లేకుండా నా ఫొటోను నగరంలోని కోనేరుసెంటర్ తదితర ప్రాంతాల్లో ఫ్లెక్సీలు, కటౌట్లపై వేశారు. వడ్డి రంగారావు ఎమ్మెల్యేగా ఉన్నప్పటి నుంచి నేను టీడీపీలో ఉన్నా. నా అనుమతి లేకుండా నా ఫొటో కటౌట్లలో ప్రచురించడం ఏంటి. ఈ కటౌట్ చూసి అందరూ వైసీపీలో ఎప్పుడు చేరావని అడుగుతున్నారు. కటౌట్లను వెంటనే తొలగించాలి.

- పిపళ్ల సూర్యప్రకాశరావు

వైఎస్ వివేకాను హతమార్చింది

జగన్ ముఠానే

రాజకీయ లబ్ధి కోసమే హత్య: బొండా ఉమా

పాయకాపురం, మార్చి 2: రాజకీయ లబ్ధి కోసమే మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డిని జగన్ ముఠా హత్య చేసిందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు ఆరోపించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. వివేకా హత్య జరిగిన రోజునే బాబాయిని గొడ్డలితో చంపారని సీఎం జగన్ చెప్పారని, అంత కచ్చితంగా జగన్ ఎలా చెబుతారని, సీఎంకు ఏమైనా అతీంద్రియ శక్తులు ఉన్నాయా అని ఆయన ప్రశ్నించారు. సీబీఐ విచారణకు వివేకా కుమార్తె సునీత డిమాండ్ చేస్తే జగన్ ఎందుకు ఆపారో చెప్పాలన్నారు. మొదటి సీబీఐ విచారణ కోరిన జగన్ గద్దెనెక్కాక సీబీఐ విచారణ వద్దు అనడానికి కారణం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. సీఎం అయిన అనంతరం జగన్ సీబీఐ పిటిషన్ ఎందుకు వెనక్కి తీసుకున్నారని ప్రశ్నించారు. బాబాయిని చంపిన అబ్బాయిని జగన్ రక్షించడం వెనుక అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. వివేకా హత్య కేసులో ఎంపీ అవినాష్‌రెడ్డిని అరెస్ట్ చేయడానికి సీబీఐ అధికారులు కర్నూల్‌కు వస్తే వారిని ఎందుకు అడ్డుకున్నారన్నారు. జగన్ సోదరి సునీత అడుగుతున్న ప్రశ్నలకు ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని, తాడేపల్లి ప్యాలెస్ నుంచి బయటకు వచ్చి వివేకానందరెడ్డిని చంపిన నిజాన్ని జగన్ ఒప్పుకోవాలని డిమాండ్ చేశారు. తమ కుటుంబానికి చెందిన ఆడబిడ్డకు న్యాయం చేయలేని సీఎం రాష్ట్రంలో ఉన్న అక్కాచెల్లెమ్మలకు ఏం న్యాయం చేస్తాడని ప్రశ్నించారు. వివేకా కుమార్తె సునీత చేస్తున్న న్యాయపోరాటానికి టీడీపీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. వివేకానందరెడ్డిని అతి క్రూరంగా గొడ్డలితో చంపిన హంతకులకు శిక్ష పడకపోతే రాష్ట్రంలో పౌరుల మాన, ప్రాణాలకు రక్షణ ఉండదన్నారు. ప్రజల మాన, ప్రాణాలకు రక్షణ ఉండాలంటే సునీత చెప్పినట్లు వచ్చే ఎన్నికల్లో జగన్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు.

సునీతారెడ్డి ప్రశ్నలకు జగన్ సమాధానం చెప్పాలి

కాగిత కృష్ణప్రసాద్ డిమాండ్

బంటుమిల్లి, మార్చి 2: "జగన్‌కు రాజకీయ లబ్ధి చేకూర్చేందుకే మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డిని జగన్ ముఠా హతమార్చింది. వివేకా హత్యపై ఆయన కుమార్తె వైఎస్ సునీతారెడ్డి సంధిస్తున్న ప్రశ్నలకు సీఎం జగన్ సమాధానం చెప్పాలి." అని టీడీపీ-జనసేన కూటమి పెడన అభ్యర్థి కాగిత కృష్ణప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం నాగేశ్వరరావుపేటలో స్థానిక స్వపరిపాలన, ఆత్మగౌరవం ఆత్మవిశ్వాసం డిక్లరేషన్ పత్రాన్ని విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. వివేకా హత్యకేసులో జగన్ పాత్రపై విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు. మొదట్లో సీబీఐ విచారణ కోరిన జగన్ తరువాత వద్దు అనడానికి కారణాన్ని రాష్ట్ర ప్రజలకు తెలపాలన్నారు. ఇకనైనా శవరాజకీయాల్ని మానుకోవాలన్నారు. సునీతారెడ్డి న్యాయపోరాటానికి 5 కోట్ల ఆంధ్రులు పార్టీలకతీతంగా మద్దతు ఇవ్వాలన్నారు.

జగన్‌రెడ్డి పాత్రపై విచారణ జరపాలి

నెట్టెం రఘురాం డిమాండ్

జగ్గయ్యపేట, మార్చి 2: వైఎస్ వివేకా హత్య కేసులో సీఎం జగన్‌రెడ్డి పాత్రపై సమగ్ర విచారణ జరపాలని టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రతిపక్ష నేతగా సీబీఐ విచారణకు డిమాండ్ చేసిన జగన్ సీఎం కాగానే యూటర్న్ ఎందుకు తీసుకున్నారని ఆయన ప్రశ్నించారు. సీబీఐ విచారణకు వివేకా కుమార్తె సునీత పిటిషన్ వేస్తానంటే ఎందుకు నిలువరించారని నిలదీశారు. సోదరుడు ఎంపీ అవినాష్‌రెడ్డిని అరెస్టు కాకుండా ఎందుకు అడ్డుకుంటున్నారని ప్రశ్నించారు. రాజకీయ లబ్ధి కోసం బాబాయిను హత్య చేయించిన జగన్.. నిందితులను కాపాడుకునే ప్రయత్నాలు చేస్తున్నారని, సోదరి సునీత లేవనెత్తిన సందేహాలను సీఎం నివృత్తి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

చెల్లికే న్యాయం చేయలేదు: దేవినేని ఉమా

గొల్లపూడి: "రాజకీయ లబ్ధి కోసం తన తండ్రి వైఎస్ వివేకాను హత్య చేయించారని వైఎస్ సునీతారెడ్డి స్పష్టంగా చెబుతున్నారు. అధికారంలోకి రావాలనే జగన్మోహన్‌రెడ్డి హత్య చేయించారని సునీత వ్యాఖ్యల ఆధారంగా స్పష్టంగా తెలుస్తోంది. వివేకా హత్య కేసులో జగన్ పాత్రపైనా విచారణ జరిపించాలి" అని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వివేకా హత్యపై జగన్ సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. సొంత చెల్లికి న్యాయం చేయలేని వాడివి ప్రజలకు ఏం న్యాయం చేస్తావని నిలదీశారు.







ప్లాంట్ కంట్రోల్ రూమ్ పనితీరు, ఉత్పత్తులను వివరిస్తున్న డెయిరీ అధికారులు, బాదం మిల్క్ పౌడర్, మిల్క్ కోవా



విజయ భేరి

(ఐదో పేజీ తరువాయి)

అక్కడి నుంచి అవి తోడుకోవటానికి వీలుగా బ్లాస్ట్ రూమ్‌ల్లోకి పంపించి మరింత వేడి చేస్తారు. ఆ తర్వాత వాటిని కోల్డ్ చాంబర్లలోకి తీసుకెళ్తారు. అక్కడ పెరుగు గడ్డకట్టుకుపోతుంది. పాల నాణ్యతను పరీక్షించటానికి రెండు క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్‌లు ఉన్నాయి. మంచి బ్యాక్టీరియాను కోల్డ్ బాక్సుల్లో నిల్వచేస్తారు. పాల నుంచి, ఫ్యాట్ నుంచి తయారు చేసిన పౌడర్‌ను కూడా కోల్డ్ స్టోరేజ్‌లలో నిల్వ చేస్తారు. పాల ప్యాకెట్లను ఉంచే ట్రేలను శుభ్రం చేయటానికి ప్రత్యేకమైన విభాగం ఉంది. ఆటోమేషన్ ప్లాంట్‌కు పాలు సరఫరా అయ్యే పైపులు, మెషినరీని శుభ్రపరిచే విధానాన్ని ఆటోమేషన్‌లోనే చేపట్టడం విశేషం. దీనికోసం సిప్ విధానం పనిచేస్తుంది. సురక్షితమైన పాలు, పాల ఉత్పత్తులను ఆటోమేషన్ విధానంలో ఉత్పత్తి చేయడమే ఇక్కడి ప్రత్యేకత.

ఆది నుంచీ విజయపథమే..

యూనిసెఫ్ ఆర్థిక సహకారంతో 1964లో కృష్ణా డిస్ట్రిక్ట్ మిల్క్ ప్రొడ్యూసర్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ యూనియన్ (కృష్ణామిల్క్ యూనియన్) ఏర్పడింది. ఈ యూనియన్ నేతృత్వంలో విజయవాడలోని చిట్టినగర్ సమీపంలో మిల్క్‌ఫ్యాక్టరీని ఏర్పాటు చేశారు. ఇది పూర్తిగా మాన్యువల్ విధానంలో పనిచేస్తుంది. వీరవల్లిలో ఏర్పాటు చేసిన మిల్క్‌ప్లాంట్ మాత్రం పూర్తి ఆటోమేషన్ విధానంలో పనిచేస్తుంది.

ఆరు దశాబ్దాల్లో అభివృద్ధిబాట

ప్రముఖులు కాకాని వెంకటరత్నం, ముక్కాల రాజా, వల్లభనేని రంగయ్య చౌదరి, పర్వతనేని వెంకటరత్నం, ఎర్నేని వెంకటేశ్వరరావులు కృష్ణామిల్క్ యూనియన్‌ను స్థాపించారు. సుదీర్ఘకాలం చైర్మన్‌గా సాగిన మండవ జానకీరామయ్య విజయా డెయిరీని ముందుకు నడిపించారు. స్థానికేతర డెయిరీల ప్రాబల్యం పెరుగుతున్న దశలో చైర్మన్‌గా వచ్చిన చలసాని ఆంజనేయులు విజయా డెయిరీని పూర్తిగా మార్చేశారు. స్థానిక ముద్రను తొలగించి రాష్ట్రీయంగా, దేశీయంగా పాలసేకరణ, పాల ఉత్పత్తులు తయారు చేయించే సంస్థగా తీర్చిదిద్దారు.

పాడి రైతుల కోసం...

సంస్థకు మూలాధారమైన పాడిరైతుల సంక్షేమం కోసం కృష్ణామిల్క్ యూనియన్ చాలా చేస్తోంది. ఇటీవల కాలంలో 'పల్లెకు పోదాం.. పాడిని పెంచుకుందాం', 'పల్లెకు పోదాం.. పాడిరైతుల లాభాలను పెంచుదాం' అనే నినాదంతో ముందుకు సాగుతోంది. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని లాభాల్లో 10 శాతం బోనస్‌గా ఇస్తోంది. ఎక్కువ పాలనిచ్చే గేదెలను అందించటం, పౌష్టికరమైన పశుదాణా ఇవ్వడం, సుశిక్షితులైన వెటర్నరీ డాక్టర్లతో క్యాంపులు నిర్వహించటం, సబ్సిడీపై పశువుల కొనుగోలుకు ప్రోత్సాహకాలు ఇవ్వడం చేపడుతోంది. పాలరైతు చనిపోతే రూ.50 వేల సహాయం, పాడిరైతు ఇంట పెళ్లిళ్లు జరిగితే కల్యాణమస్తు పథకం కింద బంగారు కాయిన్ ఇవ్వటం, ప్రతిభ స్కీమ్ కింద రైతుల పిల్లలకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ చేపడుతోంది.

కృష్ణామిల్క్ యూనియన్ బలోపేతం

విజయా డెయిరీ అభివృద్ధి పథాన సాగడానికి కృష్ణామిల్క్ యూనియన్ ప్రధాన కారణం. పాడి రైతులకు జీవనోపాధిని కల్పించటంతో పాటు పాడి ఉత్పాదకతను పెంచటానికి యూనియన్ పనిచేస్తోంది. ఇది ప్రస్తుతం 1,000 గ్రామీణ పాలసేకరణ కేంద్రాలను నిర్వహిస్తోంది. ఇవన్నీ ఆయా సొసైటీలకు ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికైన కమిటీల పర్యవేక్షణలో పనిచేస్తాయి. డైరెక్టర్లతో కూడిన సెంట్రల్ బోర్డు విజయా డెయిరీని ఆజమాయిషీ చేస్తుంది.

భారీగా పెరిగిన పాల సేకరణ

విజయా డెయిరీ భారీగా పాలసేకరణ చేపడుతోంది. 2012-13లో 5.81 కోట్ల లీటర్ల పాలను సేకరిస్తే, 2016-17 నాటికి 5.98 కోట్ల లీటర్లకు చేరింది. అలాగే, 2018-19లో 6.04 కోట్ల లీటర్లు, 2019-20లో 7.07 కోట్ల లీటర్లు, 2020-21లో 8.94 కోట్ల లీటర్లు, 2022-23 ఆర్థిక సంవత్సరంలో 10.1 కోట్ల లీటర్ల పాలను సేకరించింది. ఆరున్నరేళ్లలో విజయా ఎదుగుదలను ఇది ప్రతిబింబిస్తుంది. విస్తరణతో పాటే వృద్ధి కూడా గణనీయంగా పెరుగుతూ వస్తోంది. 2017-18లో రూ.662 కోట్ల టర్నోవర్‌గా ఉన్న విజయా డెయిరీ 2018-19లో రూ.712 కోట్లు, 2019-20లో రూ.794 కోట్లు, 2020-21లో రూ.915 కోట్లు, 2021-22లో రూ.1,007 కోట్లు, 2022-23లో 1,106 కోట్ల టర్నోవర్‌ను సాధించింది.

లాభాలపాలు

విజయా డెయిరీ పాలసేకరణతో ప్రారంభించి పాల ఉత్పత్తులతో మంచి లాభాలనే సాధిస్తోంది. 2014-15లో రూ.72 కోట్ల లాభంలో ఉన్న డెయిరీ అంచెలంచెలుగా ఎదిగింది. 2015-16లో రూ.76 కోట్ల లాభం, 2016-17లో రూ.63 కోట్లు, 2017-18లో రూ.78 కోట్లు, 2018-19లో రూ.84 కోట్లు, 2019-20లో రూ.102 కోట్లు, 2020-21లో రూ.127 కోట్లు, 2021-22లో రూ.159 కోట్ల లాభాన్ని సాధిస్తే, 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.180 కోట్ల లాభం వచ్చింది.

రకరకాల పాల ఉత్పత్తులు

విజయా డెయిరీ పాలు, పెరుగు, మజ్జిగ, లస్సీనే కాకుండా దూద్‌పెడ, మలాయి లడ్డు, ఫెస్టివల్ స్వీట్స్, మిల్క్ కేక్, బటర్ బర్ఫీ, చాక్లెట్ బర్ఫీ, ఖర్జూర కోవా, కళాకానీ, మిక్స్‌డ్ లడ్డు, బాదం మిల్క్ పౌడర్, మిల్క్ పౌడర్, నెయ్యి, కౌ మిల్క్ వంటి అనేక రకాల ఉత్పత్తులను తయారు చేస్తోంది. వీటిని లాభాపేక్ష కోసం కాకుండా ఏజెంట్ల వ్యాపారం కోసం మార్జినల్ రేట్లకు అందిస్తోంది.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	137, 146, 157
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.63

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ఉయ్యూరు, మార్చి 2 : ఉయ్యూరులో పోలింగ్ కేంద్రాలను ఆర్డీవో డి రాజు శనివారం పరిశీలించారు. ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాలలో పోలింగ్‌కు సంబంధించిన అంశాలను తహసీల్దార్ గురుమూర్తిరెడ్డితో కలసి పరిశీలించారు. రెవెన్యూ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో రాజు

విద్యార్థిని మృతిపై కేసు నమోదు

పెనమలూరు, మార్చి 2 : విద్యార్థినుల మధ్య జరిగిన ఘర్షణ నేపథ్యంలో ఒక విద్యార్థిని ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పమిడిముక్కల మండలం కపిలేశ్వరపురం గ్రామానికి చెందిన విద్యార్థిని రిషిత (18) పెనమలూరులో తన పిన్ని ఇంటి వద్దే ఉంటూ ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతోంది. తోటి విద్యార్థినులతో ఘర్షణ జరుగుతుండేది. ఈ నేపథ్యంలో యాజమాన్యం విద్యార్థిని తల్లిదండ్రులతో మాట్లాడదామని పిలిపించారు. ఈ విషయం తెలుసుకొన్న విద్యార్థిని తండ్రి, పిన్ని స్కూలుకు వచ్చి అడుగుతారని భయపడి మనస్తాపం చెంది గత నెల 22న ఇంట్లో ఉరివేసుకొంది. ఇది గమనించిన బంధువులు వెంటనే విజయవాడ ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ గత నెల 29న మృతి చెందింది. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు.

బాకీ చెల్లించలేదని వ్యక్తి కిడ్నాప్

పెనమలూరు, మార్చి 2 : తమకు చెల్లించాల్సిన డబ్బు చెల్లించడం లేదని తాడిగడప శ్రీనగర్ కట్టకు చెందిన ఒక వ్యక్తిని అమలాపురం నుంచి వచ్చిన ఒక బ్యాచ్ కిడ్నాప్ చేసి తీసుకెళుతుండగా, తెలుసుకొన్న బంధువులు పెనమలూరు పోలీసులను ఆశ్రయించారు. దీంతో అప్రమత్తమైన పెనమలూరు పోలీసులు కిడ్నాపర్లను వెంబడించి వారిని అదుపులోకి తీసుకొని బాధితుడిని రక్షించినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



ఆర్థిక సాయం చేస్తున్న బోడె వెంకట్రామ్

నెప్పల్లి (కంకిపాడు), మార్చి 2 : బాధిత కుటుం బాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కుమారుడు బోడె వెంక ట్రామ్ అన్నారు. అగ్నిప్రమాదంలో అగ్నికి ఆహుతైన పూరిళ్లను ఆయన సందర్శించారు. బాధిత కుటుంబా లు గంపా శ్రీనివాసరావు, నాగమల్లేశ్వరి, కుక్కల తాత య్య, షేక్ బేగం, పి. దుర్గారావు, పి. శ్రీనివాసరావులకు ఆర్థిక సాయం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్రామ్ మాట్లాడుతూ అగ్ని ప్రమా దానికి ఆహుతైన కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా తన తండ్రి బోడె ప్రసాద్ నిత్యం పేద ప్రజలకు అందుబాటులో ఉంటూ వచ్చారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అనుమోలు ప్రభాకర్, సుదిమళ్ల రవీంద్ర, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

వీరమ్మ తిరునాళ్లకు భక్తుల రద్దీ

● రేపటితో ముగియనున్న తిరునాళ్ల

● మొక్కులు తీర్చుకునేందుకు అధిక సంఖ్యలో తరలివస్తున్న భక్తులు

ఉయ్యూరు, మార్చి 2 : వీరమ్మతల్లి తిరునాళ్లకు శనివారం భక్తుల రద్దీ పెరిగింది. మరో రెండు రోజుల్లో తిరునాళ్ల ముగియనున్న నేపథ్యంలో మొక్కు బడి తీర్చుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వస్తున్నారు. చలువ కావిడిలు, పసుపు కుంకుమ, చీర సారె, గొర్రె పొటేళ్లతో డప్పువా యిద్యాల నడుమ సందడిగా వచ్చి ఆలయ ప్రదక్షిణ చేసి అమ్మ వారిని దర్శించుకుంటున్నారు. తిరునాళ్లలో చివరి ఆదివారం రోజున భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుందని అంచనా కాగా అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు తరలి వచ్చి మొక్కుబడి తీర్చుకుంటారని భావిస్తున్నారు.



వీరమ్మతల్లికి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

భారీ అన్న సమారాధన

వీరమ్మ తిరునాళ్ల పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం వేలాది మంది భక్తులకు అన్న సమారాధన చేశారు. తిరునాళ్లకు పలు ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలిరాగా వారికి అన్న సమారాధన చేసి సేవలందించారు. దూర ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులతో పాటు ఉయ్యూరు, పరిసర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు. పలు సంస్థలు, వ్యక్తులు పాల్గొని సేవలందించారు.

డీజేల మోత!

గుండెలదిరేలా డీజేలు, మైకుల మోత, మితిమీరిన శబ్ధకాలుష్యంతో ఉయ్యూరులో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వీరమ్మ తిరునాళ్ల సందర్భంగా వ్యానులు, ఆటోల నిండా రణగొణ ధ్వనులు చేస్తూ చెవులు పగిలే శబ్ధాలతో శబ్ద కాలుష్యం చేస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని విమర్శలు విన వస్తున్నాయి. తిరునాళ్లకు వెళ్లే వారు డీజేలు, పదుల సంఖ్యలో వ్యానులకు అమర్చి, కీబోర్డు ధ్వనులతో వెళుతూ, రోడ్డుపై నడిచేందుకు వీలు లేకుండా చేస్తూ పగలు, రాత్రులు అనకుండా అర్ధరాత్రి వరకు విపరీతమైన శబ్ధాలు చేస్తుండటంతో ఇళ్లలో నిద్రించే అవకాశం లేకుండా చేయడమే కాక, విపరీతమైన మోతతో భవనాలు సైతం అదిరేలా చేస్తున్నారు. డీజేలు, మైకులమోతతో హృద్రోగులు ఇబ్బందులు పడుతున్నారు.



వాహనానికి కట్టిన డీజేలు, మైక్‌లు

అమలుకాని డీఎస్పీ ఆదేశాలు

తిరునాళ్లకు మితిమీరి మైకులు, డీజేతో వెళ్లేవారిని అనుమతించవద్దని గన్నవరం డీఎస్పీ బీఆర్ జయసూర్య పట్టణ పోలీసులకు రెండు రోజుల క్రితం ఆదేశించారు. ఉయ్యూరు పట్టణ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఆయనకు డీజేలా బాధ, ప్రజల ఇబ్బందులను స్థానికులు మొరపెట్టుకున్నారు. డీజేల మోతతో నాలుగు సంవత్సరాల క్రితం ప్రధాన సెంటర్‌లో ఓ హోటల్ ముందు నిలబడి ఉన్న వ్యక్తి కుప్పకూలి మరణించిన సంఘటనలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో డీజేలు పెట్టుకుని తిరునాళ్లకు వెళ్లేందుకు అనుమతించవద్దని, డీజేలు అద్దెకిచ్చేవారికి నోటీసులు ఇవ్వాలని పోలీసులను ఆదేశించారు. సాక్షాత్తు డీఎస్పీ ఆదేశాలు సైతం అమలుకు నోచుకోపోవడం ఏమిటని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక లోడు టిప్పర్లను అడ్డుకున్న ఇరిగేషన్ అధికారులు

కంకిపాడు, మార్చి 2 : అధిక లోడుతో వెళ్తున్న ఇసుక టిప్పర్లను ఇరిగేషన్ అధికారులు అడ్డుకున్నారు. దీంతో టిప్పర్ డ్రైవర్లు, ఓనర్లు ఇరిగేషన్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. కొంత సేపు ట్రాఫిక్ జామ్ అయింది. చర్చల అనం తరం చివరి వార్నింగ్ ఇచ్చి వాహనాలను అధికారులు వదిలిపెట్టారు. సేకరించిన సమాచారం మేరకు.. తోట్లవల్లూరు మండలంలోని వల్లూరుపాలెం, తోట్లవల్లూరులోని ఇసుక క్వారీల నుంచి టిప్పర్లు సుమారు 50 టన్నుల పైనే ఇసుక లోడుతో వెళ్తున్నాయి. ఇంత భారీ లోడుతో ఇరిగేషన్ కార్యాలయం వద్ద పుల్లేటి కాలువపై వంతెన, బందరు కాలువపై వంతెనల పైనుంచి వెళ్తుండటంతో వంతెనలు కూలే ప్రమాదముందని ఇరిగేషన్ సూపరింటెండెంట్ రమణయ్య టిప్పర్లను అడ్డుకున్నారు. లారీలను వెనక్కు తిరిగి వెళ్లిపోవాలంటూ ఆదేశించారు. సమాచారం అందుకున్న టిప్పర్ ఓనర్లు ఇరిగేషన్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఇరిగేషన్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. అయినా ఇరిగేషన్ అధికారులు టిప్పర్లను అనుమతించేది లేదంటూ భీష్మించుకున్నారు. చేసేది లేక టిప్పర్ ఓనర్లు ఇకపై వాహనాలు రావాంటూ ప్రాధేయ పడటంతో టిప్పర్లను అధికారులు అనుమతించారు.



నిలిపేసిన అధిక లోడు టిప్పర్లు

చట్టాలపై అవగాహన అవసరం

ఉయ్యూరు న్యాయాధికారి కె. శ్రీహరి

ఆకునూరు(ఉయ్యూరు), మార్చి 2 : విద్యార్థి దశ నుంచి చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని ఉయ్యూరు న్యాయాధికారి కె. శ్రీహరి అన్నారు. ఆకునూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన పాల్గొని విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. బాలికలు, మహిళలకు అమలులో ఉన్న చట్టాలు, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్ వంటి అమానుష చర్యలకు చట్టపరమైన శిక్షలు తదితర అంశాలను వివరించారు. బాలురకు పలు సూచనలు చేశారు. క్రమశిక్షణతో కష్టపడి విద్య నభ్యసించాలని, దీంతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని సూచించారు. హెచ్‌ఎం సలోమి, న్యాయవాదులు పాల్గొన్నారు.

మ్యాట్‌ల్యాబ్ సిములింక్ ఉపయోగాలపై ఉషారామాలో వర్క్‌షాప్

ఉంగుటూరు, మార్చి 2 : గణన సాధనాల రంగంలో, సంఖ్యా కంప్యూటింగ్, అనుకరణ, డేటా విశ్లేషణలో ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు, పరిశోధకులకు మ్యాట్‌ల్యాబ్, సిములింక్ పరికరాలు ఎంతగానో దోహదపడతాయని హైదరాబాద్ డీఆర్‌డీవో శాస్త్రవేత్త పి.అనిల్‌కుమార్ అన్నారు. తేలప్రోలు ఉషారామా ఇంజనీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగం తృతీయ సంవత్సరం విద్యార్థులకు మ్యాట్‌ల్యాబ్ సిములింక్ ఉపయోగాలపై శనివారం ఒక్కరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అనిల్‌కుమార్ మ్యాట్‌ల్యాబ్ సిములింక్ విశిష్టత, అనుసంధానమైన పరికరాలు, వాటిద్వారా భవిష్యత్తులో కలిగే ప్రయోజనాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసీఈ విభాగాధిపతి బి.నాంచారయ్య మాట్లాడుతూ, సర్క్యూట్ డిజైనింగ్, సిములింక్‌పై విద్యార్థులు మంచి పట్టు సాధించి భవిష్యత్తులో వివిధ రంగాల్లో ముందడుగు వేయటానికి ఎంతగానో దోహదపడతాయన్నారు.



డీఆర్‌డీవో శాస్త్రవేత్త అనిల్‌కుమార్‌ను సత్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

అర్జునుడు లేని లోటు టీడీపీకి తీర్చలేనిది

టీడీపీ గన్నవరం అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, మార్చి 2 : తెలుగుదేశం పార్టీకి, కార్యకర్తలకు మాజీ ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు లేని లోటు తీర్చలేనిదని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. మాజీ ఎమ్మెల్సీ బచ్చుల అర్జునుడు ప్రథమ వర్ధంతి కార్యక్రమాన్ని టీడీపీ గన్నవరం నియోజకవర్గ కార్యాలయంలో శనివారం రాత్రి నిర్వహించారు. అర్జునుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీకేఆర్ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు, అనాథ పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, టీడీపీకి అంకితభావంతో పనిచేసిన నాయకుడు బచ్చుల అని కొనియాడారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన ఆయన అరాచక శక్తులకు భయపడక ఎదురొడ్డి నిలిచి పార్టీని నిలబెట్టారని ప్రశంసించారు. అధికార పార్టీ వేధింపులను, దాడులను తట్టుకుని నిలబడి కార్యకర్తలకు అండగా ఉన్నారని, ఆయన లేని లోటు క్యాడర్‌కు తీర్చలేనిదన్నారు. బచ్చుల ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా టీడీపీ కార్యాలయంపై వైసీపీ గూండాలు దాడి చేసి ధ్వంసం చేశారని, ఆయన ఉంటే ఆ పరిస్థితి ఉండేది కాదన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు, దొంతు చిన్న, చిరుమామిళ్ల సూర్యం, దయాల రాజేశ్వరరావు, గొడ్డళ్ల చిన రామారావు, గుజ్జర్లపూడి బాబూరావు, మోదుగుమూడి సత్యనారాయణ, కొండేటి వెంకటేశ్వరరావు, కొండ, సుధాకర్, సర్నాల బాలాజీ, మేడేపల్లి రమ, మండవ లక్ష్మి, చిక్కవరపు నాగమణి, మండవ రమ్య, పుట్టా సురేష్, లక్ష్మి సతీష్, సరిత, రాధికా, పాల్గొన్నారు.



అర్జునుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యార్లగడ్డ వెంకట్రావు, టీడీపీ నాయకులు

ఓటరు జాబితా పరిశీలనపై అవగాహన

పెనమలూరు, మార్చి 2 : ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో భవిష్యత్తు కార్యాచరణ, ఓటరు జాబితాలు, ఓటరు వెరిఫికేషన్లపై పార్టీ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అవగాహన కల్పించారు. శనివారం పోరంకి టీడీపీ కార్యాలయంలో ఆరవ క్లస్టరు శ్రేణులకు, శుక్రవారం 1,2క్లస్టర్ల శ్రేణులకు పార్టీ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకరబాబు, సంగెపు రంగారావు, యార్లగడ్డ సుచిత్ర, షేక్ బుజ్జిల ఆధ్వర్యంలో జరిగిన సమావేశాల్లో శిక్షణ, అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. జనసేన శ్రేణులతో కలిసి ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో మారుపూడి ధన కోటేశ్వరరావు, కోయ ఆనంద్ ప్రసాద్ హాజరయ్యారు.



పోరంకిలో టీడీపీ శ్రేణులకు అవగాహన కల్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్

తోపుడు బండి అందజేత

టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ కార్యదర్శి మొక్కపాటి శ్రీనివాస్, ప్రసన్నకుమారి దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా యనమలకుదురుకు చెందిన నిరుపేద చంద్రశేఖర్ అనే వ్యక్తికి మాజీ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ చేతుల మీదుగా తోపుడు బండిని అందజేశారు. కార్యక్రమంలో అనంతనేని చంద్రశేఖర అజాద్, సంగెపు రంగారావు, సంపర శేఖర్, సుబ్బు, లంకా కృష్ణసాయి, శేఖర్, పీతా గోపీచంద్, పాదాల ప్రభాకర్, పండల రజిని, సరస్వతి పాల్గొన్నారు.

టీడీపీ మేనిఫెస్టోతో రాష్ట్రానికి మేలు

టీడీపీ మేనిఫెస్టోతో రాష్ట్ర ప్రజలకు అమితమైన మేలు జరుగుతుందని టీడీపీ నాయకులు దేవినేని గౌతమ్ దంపతులు పేర్కొన్నారు. శనివారం పోరంకి కట్టపై జరిగిన బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో వారు పాల్గొని ప్రజలతో మాట్లాడారు. మేనిఫెస్టోలోని అంశాలతో రాష్ట్రంలోని మహిళలకు మరింత మేలు జరగుతుందని పేర్కొన్నారు. మహిళలు ఆర్థికంగా తమ కాళ్లమీద తాము నిలబడేందుకు మేనిఫెస్టో దోహదపడుతుందని పేర్కొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేద్దాం

గన్నవరం, మార్చి 2 : పల్స్ పోలియో విజయవంతం చేయాలని మండల వైద్యధికారి డాక్టర్ పర్వతనేని శ్రీహర్ష అన్నారు. ముస్తాబాద పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో ఏఎన్‌ఎం, ఆశా వర్కర్‌లు పల్స్ పోలియోపై అవగాహన కల్పిస్తూ శనివారం ర్యాలీలు నిర్వహించారు. ఆత్కూరు పీహెచ్‌సీ పరిధిలోని తెంపల్లి, బల్లిపర్రు, వీరపనేనిగూడెం, మెట్లపల్లి, కొత్తగూడెం, చిక్కవరం, గొల్లనపల్లి గ్రామాల్లో హెల్త్ సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరరావు పర్యవేక్షణలో అవగాహన ర్యాలీలు జరిగాయి.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : ఐదేళ్ల లోపు చిన్నా రులందరికీ పల్స్‌పోలియో చుక్కలు వేయించాలని హెచ్‌ఎం వెంకటేశ్వరరావు సూచించారు. శనివారం సింగన్నగూడెంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో పల్స్‌పోలియోపై అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు.

ఉంగుటూరు : నేడు (ఆదివారం) జరిగే పల్స్ పోలియో కార్యక్రమంలో మండల వ్యాప్తంగా 27 గ్రామాల్లోని చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని ఇందుపల్లి, ఉంగుటూరు, పెద అవుటపల్లి, ఆత్కూరు పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ బి.శిరీష, వీవీ సుబ్బారావు, ప్రసన్న, వాణి, సుజిత, కరీముల్లా మొహినుద్దీన్, మనోహర్‌రెడ్డి సూచించారు.

పనులు కాకుండానే ప్రారంభమా!

బస్టాండ్ నిర్మాణ పనులను పరిశీలించిన అధికారులు

హనుమాన్‌జంక్షన్, మార్చి 2 : బస్టాండ్ నిర్మాణ పనులను ఆర్టీసీ అధికారులు శనివారం పరిశీలించారు. ఈ నెల 5న అధికారికంగా ప్రారంభోత్సవం నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. శిలాఫలకం ఏర్పాటు చేయడానికి అవసరమైన దిమ్మను కూడా నిర్మించారు. ఆర్టీసీ ఇంజనీరింగ్ విభాగం ఈఈ రాజశేఖరం, జిల్లా ప్రజారవాణా శాఖాధికారి వాణిశ్రీ, గన్నవరం డీఎం శివాజీ పనులు పరిశీలించారు. ప్రారంభోత్సవానికి అవసరమైన చర్యలపై సమీక్షించారు.



మండుటెండలో రోడ్డుపై ప్రయాణికులు

నాణ్యతలో డొల్లతనం!

దాదాపు రెండున్నరేళ్లపాటు నిర్మించిన ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం నాణ్యతలో డొల్లతనం కనిపిస్తోంది. ప్రారంభోత్సవా నికి ముందే అతికించిన టైల్స్ విరిగిపోయి దర్శనం ఇస్తున్నా యి. బస్సులు రాకపోకలు సాగించే ప్రాంగణం ప్రస్తుతం మట్టితో అభివృద్ధి పరిచారు. వర్షం పడితే మట్టి కుంగిపోయే ప్రమాదం ఉంది. దీనిపై అధికారులు ఏ చర్యలు తీసుకుంటారో వేచిచూడాల్సి ఉంది.

మండుటెండలో ప్రయాణికులు

కొత్తబస్టాండ్‌ను ప్రారంభించే సన్నాహాల్లో భాగంగా అవుట్ గోయింగ్, ఇన్‌కమింగ్ మార్గాలతో పాటు ముఖద్వారం అప్రోచ్ మార్గాన్ని బీటీతో అభివృద్ధి పనులు శనివారం చేపట్టారు. పనులకు అటంకం కలగకుండా బస్సులు కొత్త బస్టాండ్ అప్రోచ్ మార్గం వైపు రాకుండా పాత బస్టాండ్ ప్రవేశ మార్గాల్లో ట్రాఫిక్ ఐల్యాండ్స్ పెట్టి మూసివేశారు. దీంతో బస్సులు జాతీయ రహదారి మీదే నిలపాల్సి వచ్చింది. ప్రయాణికులు రోడ్డు మీదే బస్సుల కోసం మండుటెండలో వేచి ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది. బీటీ రోడ్డు అభివృద్ధి పనులు మూడు రోజులు పాటు జరగనున్నాయి. ఈ మూడు రోజులు ప్రయాణికులు రోడ్డు మీద పడగాపులు పడాల్సి పరిస్థితి ఏర్పడింది.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	137, 146, 157
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.63

సునీతారెడ్డి ప్రశ్నలకు జగన్ సమాధానం చెప్పాలి : గోపు

మచిలీపట్నం టౌన్ : వివేకా కుమార్తె సునీత అడిగిన ప్రశ్నలకు జగన్‌రెడ్డి సమాధానం చెప్పగలడా అని జిల్లా తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ అన్నారు. కానూరులో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎస్ వివేకానందరెడ్డి హత్య నరకాసుర చరిత్ర అని గగ్గోలు పెట్టారన్నారు. చివరికి గొడ్డలి వేటు చరిత్ర ఎవరిదో సునీత వల్ల తెలిసిందన్నారు. సొంత బాబాయ్‌ని ఎవరు పొట్టన పెట్టుకున్నారో ప్రజలకు పూర్తిగా అర్థమవుతుందన్నారు. మొదట్లో సీబీఐ విచారణను జగన్‌రెడ్డి కోరారని, అధికారంలోకి వచ్చిన తరువాత మాట మార్చారన్నారు. సునీత సీబీఐ విచారణ అడుగుతుంటే ఎందుకు ఒప్పుకోవడం లేదో జగన్‌రెడ్డి వివరణ ఇవ్వాలన్నారు. తన కుటుంబాన్ని చక్కదిద్దుకోలేని జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని ఎలా పరిపాలిస్తాడని ప్రశ్నించారు. పి.వి.ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు



కార్మికుల సమస్యలు వింటున్న వెనిగండ్ల రాము



కనుమూరు పల్లెబాటలో పర్యటిస్తున్న పామర్రు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కుమార్ రాజా



పోలుకొండ సీఎస్ఐ చర్చిలో మాట్లాడుతున్న వెనిగండ్ల రాము

వైసీపీ పాలనలో ఎక్కడి సమస్యలక్కడే!

● గుడివాడ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము ధ్వజం

గుడివాడ, మార్చి 2 : తాను పుట్టి పెరిగిన 24వ వార్డులో ఎక్కడ చూసినా సమస్యలే దర్శనమిస్తున్నాయని గుడివాడ నియోజక వర్గ టీడీపీ అభ్యర్థి వెనిగండ్ల రాము ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని 23, 24 వార్డుల్లో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్‌లతో కలిసి వెనిగండ్ల రాము శనివారం బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అర్బన్ బ్యాంకు చైర్మన్ పిన్నమనేని బాబ్జీ, మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, దింట్యాల రాంబాబు, మజ్జి శ్రీనివాస్, పండ్రాజు సాంబశివరావు, మట్టారాము, కదం శ్రీను, పులిపలుకుల మణికంఠ, పందిళ్ల మల్లి, గొల్లభాస్కరరావు, సరిహద్దు మునిబాబు, చల్ల దుర్గ, అరవ మురుగేష్ పాల్గొన్నారు.

జగన్ పాలనలో కార్మికుల పస్తులు

జగన్‌రెడ్డి పాలనలో ఇసుక కొరతతో భవన నిర్మాణ కార్మికులు ఉపాధి లేక పస్తులు ఉంటున్నారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెనిగండ్ల రాము అన్నారు. ఏలూరురోడ్డులోని చిన్నకార్ల స్టాండ్ వద్ద భవన నిర్మాణ కార్మికులతో వెనిగండ్ల ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్మికుల శ్రమ నుంచి పుట్టిన పార్టీ టీడీపీ అన్నారు. గతంలో చంద్రబాబు హయాంలో చేతినిండా పని తో కార్మికులు కళకళలాడుతూ ఉండేవారన్నారు. అన్నా క్యాంటీన్‌లను వినియోగించుకుని డబ్బులను మిగుల్చుకునే వాళ్లన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి భవన నిర్మాణ కార్మికుల పరిస్థితులు తలకిందులయ్యాయన్నారు. టీడీ పీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం వచ్చాక భవన నిర్మాణ సంక్షేమ బోర్డు లోని డబ్బంతా కార్మికుల సంక్షేమానికి వినియోగిస్తామన్నారు.

అభివృద్ధి చంద్రబాబుకే సాధ్యం

పామర్రు : రాష్ట్రం అన్నివిధాల అభివృద్ధి దిశలో పయనించేందుకు టీడీపీ అధినేత చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసే బాధ్యత ప్రజలందరిపై ఉందని పామర్రు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి వర్ల కుమార్‌రాజా అన్నారు. పల్లెబాట 27వ రోజు కనుమూరులో శనివారం పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. కనుమూరుకు చెందిన ప్రవాసాంధ్రులు కుమార్ రాజాకు సంఘీభావం తెలిపారు. రైతులు తమ సమస్యలను కుమార్ రాజాకు వివరించారు. నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, మండల టీడీపీ అధ్యక్ష కార్యదర్శులు కుదరవల్లి ప్రవీణ్‌చంద్ర, ఈడే నాని, గోట్టిపాటి లక్ష్మీదాస్, మాజీ ఎంపీపీ దగ్గుబాటి ఉషాఫణీంద్ర, వల్లూరిపల్లి గణేష్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు కూరాడ వెంకటేశ్వరరావు, జగ్గరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్‌రెడ్డి వెన్నులో వణుకు : దింట్యాల

గుడివాడ : టీడీపీ, జనసేన కలయికతో జగన్ రెడ్డికి వెన్నులో వణుకు మొదలైందని పట్టణ టీడీపీ అధ్యక్షుడు దింట్యాల రాంబాబు అన్నారు. బైపాస్ రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయ న విలేకరులతో మాట్లాడారు. సామాజిక పెన్షన్ విషయంలో వైసీపీ నాయకులు నీచరాజకీయాలకు తెరలేపారన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే పెన్షన్‌లను నిలుపుదల చేస్తారంటూ దుష్ప్రచారానికి పాల్పడుతున్నారన్నారు. పేదలంటే జగన్‌రెడ్డికి ఏ మాత్రం గౌరవం లేదన్నారు. అందునా పెన్షన్‌దారులంటే చులకన భావం ఎక్కువని దింట్యాల అన్నారు. మాజీ కౌన్సిలర్ పొట్లూరి కృష్ణారావు,ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

క్రీస్తు కృపతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలి : వెనిగండ్ల

నందివాడ : పోలుకొండ సీఎస్ఐ చర్చి తొమ్మిదో వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. గుడివాడ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి వెనిగండ్ల రాము ముఖ్యఅతిథిగా విచ్చేశారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్వరరావు, గుడివాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రామశాస్త్రి, గ్రామ సర్పంచ్ మానేపల్లి ఝాన్సీ కుమారి, గ్రామ టీడీపీ అధ్యక్షుడు, కూర్మా శ్రీనివాసరావు గ్రామస్థులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనల అనంతరం రామును ఘనంగా సత్కరించారు. లోక రక్షకుడైన క్రీస్తు కృపతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం 1500 మందికి అన్నసమారాధన నిర్వహించారు. సీఎస్ఐ చర్చి కమిటీ పెద్దలు వల్లే లోకేశ్వరరావు, మానేపల్లి నాగేశ్వరరావు, దోమతోటి చిట్టి, చిట్టా ప్రసన్న, చుండూరి ప్రకాశరావు, చర్చి పాస్టర్ ఏలీషారావు, సర్వేశ్వరరావు, అందుగుల ఏసుపాదం, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న శ్రీకాంత్



యాసం చిట్టిబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

టీడీపీ నేతలు శ్రీకాంత్, చిట్టిబాబు జన్మదిన వేడుకలు

గుడివాడ, మార్చి 2 : టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వెనిగండ్ల రాము మేనల్లుడు పెద్దు శ్రీకాంత్ మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని వక్తలు పేర్కొన్నారు. గుడివాడ టాక్సీవాలా అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను శ్రీకాంత్ కట్ చేసి మజ్జిగ పంపిణీ చేశారు. ధనియాలపేటలో 30వ వార్డు ఇన్‌చార్జ్ దేవాది నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బేతవోలు శాంతి వృద్ధాశ్రమంలో కేక్‌ను కట్ చేసి వృద్ధులకు భోజన వసతి ఏర్పాటు చేశారు. బంటుమిల్లి రోడ్డు శ్రీనివాస్ సెంటర్‌లో ఐటీడీపీ క్రాంతి ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. టీడీపీ, జనసేన నాయకులు శ్రీకాంత్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

అవనిగడ్డ రూరల్ : టీడీపీ మండల అధ్యక్షులు యాసం చిట్టిబాబు జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. చెన్ను రవి కార్యాలయం వద్ద యాసం చిట్టిబాబును గజమాలతో సత్కరించారు. టీడీపీ అభిమానులు, జనసేన కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. యలవర్తి చిన్నా, బండే రాఘవ, ముళ్లపూడి శ్రీనివాసరావు, విశ్వనాథుని మురళీ, గరికపాటి సుధతోపాటు పలువురు చిట్టిబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

బచ్చుల అర్జునుడు సేవలు చిరస్మరణీయం



అర్జునుడు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కొనకళ్ల, కొల్లు రవీంద్ర

మచిలీపట్నం టౌన్, మార్చి 2 : మచిలీపట్నం నగర అభివృద్ధికి , బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి బచ్చుల అర్జునుడు చేసిన సేవలు చిరస్మరణీయమని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, కొనకళ్ల నారాయణ అన్నారు. బచ్చుల అర్జునుడు ప్రథమ వర్ధంతి సందర్భంగా శనివారం మచిలీపట్నం టీడీపీ అసెంబ్లీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి టీడీపీ నేతలు నివాళులర్పించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బచ్చుల బోసుబాబు, సీనియర్ టీడీపీ నాయకుడు గొర్రిపాటి గోపీచంద్, మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, నగర టీడీపీ అధ్యక్షుడు ఎండీ ఇలియాస్ బాషా, కార్యదర్శి పిప్పళ్ళ కాంతారావు, బచ్చుల అనిల్ కుమార్, దింటకుర్తి సుధాకర్, మరకాని పరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

అవనిగడ్డ : బచ్చుల అర్జునుడు ప్రథమ వర్ధంతిని టీడీపీ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కొల్లూరి వెంకటేశ్వరరావు, మాచవరపు ఆదినారాయణ, బండే రాఘవ, బచ్చు రఘునాథ్, గోళ్ల సుబ్బయ్య, మేడికొండ విజయ్, దాసినేని శ్రీను, మండలి రామ్మోహనరావు, షేక్ బాబావలి, మెగావత్ గోపి, తండు గంగాధర్, చెన్ను గాంధీ, చెన్ను బాబురావు, మునిపల్లి చంటి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషపై తెలంగాణ ఉద్యమ ప్రభావం



మాట్లాడుతున్న సుమతి దేవి

అవనిగడ్డ : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగాధిపతి డాక్టర్ భాగ్యవేణి ఆధ్వర్యంలో తెలుగు భాషపై తెలంగాణ ఉద్యమ ప్రభావంపై అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమారాణి అధ్యక్షతన జరిగిన వర్క్‌షాప్‌లో తెలం గాణాకు చెందిన తారా డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ రచ్చ సుమతిదేవి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమ నేపథ్యం - భాషా సాహిత్యంపై ప్రభావం గురించి వివరించారు. ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ .కె.వి.శాంతకుమారి సినిమా రంగంపై తెలంగాణ ఉద్యమ ప్రభావాన్ని వివరించారు. తొలి టాకీ మూవీ భక్త ప్రహ్లాద పాటలు రచయిత చెంచాల కేశవదాసు ప్రసంగించారు. బంటుమిల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టర్.జి.బి.ఆనంద్ కుమార్, అధ్యాపకులు శ్రీకాంత్, కళాశాల అధ్యాకులు పాల్గొన్నారు.

విద్యావికాస్‌లో ఎకో క్లబ్



గుడివాడ : రాష్ట్ర ప్రభుత్వ నేషనల్ గ్రీన్ కార్ప్ డైరెక్టర్ పి.స్రవంతి ఎకో క్లబ్ స్కూల్స్ సందర్శనలో భాగంగా శనివారం విద్యావికాస్ పాఠశాలను సందర్శించారు. ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ పదవ తరగతి విద్యార్థులకు నిర్వహించారు. పదవ తరగతి తరువాత విద్యాభ్యాసంపై కెరీర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. చిన్నారుల వెజిటబుల్ గార్డెన్‌ను సందర్శించి అభినందించారు. ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ కె.అన్నపూర్ణ, విద్యావికాస్ పాఠశాల డైరెక్టర్లు ముప్పాళ్ళ సుబ్బారావు, కొమ్మినేని సాంబశివరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వేంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్‌గా రాంబాబు

గుడివాడ : జగన్నాథపురం వేంకటేశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకార మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. చైర్మన్‌గా డొక్కు రాంబాబు, సభ్యులుగా వి.బ్రహ్మాజీ, ఎ.ధనలక్ష్మీ, డి.కృష్ణారావు, ఎం.రమ్యరెడ్డి, జి.నాగేంద్ర, టి.సునీతలతో దేవదాయ, ధర్మాదాయ శాఖ అధికారులు ప్రమాణస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కొడాలి నాని విచ్చేశారు. వైసీపీ నాయకులు, దేవదాయ శాఖ అధికారులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

పోతురాజు స్వామి గుడి తోట వంశస్తులదే : పైడేశ్వరరావు

పెడన : తమ పూర్వీకులు నిర్మించిన పట్టణంలోని పోతురాజు స్వామి గుడి తమ వంశస్తులకే చెందుతుందని పేర్కొంటూ గుడిని నిర్వహిస్తున్న తోట పైడేశ్వరరావు పెడన ఎస్సైకు శనివారం వినతిపత్రం అందజేశారు. వర్షపు నీరు ప్రవేశిస్తుండటంతో పునర్నిర్మాణానికి తమ వంశస్తులు తలపెట్టిన శంకుస్థాపన కార్యక్రమాన్ని గుడితో ఎలాంటి సంబంధం లేని వ్యక్తులు అడ్డుకున్నారని ఆయన ఆరోపించారు. గుడి తమ వంశస్తులదేనని చెప్పడానికి తమ వద్ద తగిన ఆధారాలు ఉన్నాయని, పరిశీలించి తమకు న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

గీతా మందిరానికి జీవధ్వజం సమర్పణ

అవనిగడ్డ : అవనిగడ్డలోని గీతా మందిరానికి సూరగం హరి ప్రసాదరావు మాస్టారు జ్ఞాపకార్థం కుమారులు శ్రీనివాసరావు జీవధ్వజస్తంభాన్ని సమర్పించారు. నేరేళ్లపాలెం ఆరో వార్డులో నిర్మిస్తున్న కోదండ రామ మందిరం నుంచి మంగళవాయిద్యాలతో భక్తిశ్రద్ధలతో పురవీధులలో శోభాయాత్రగా వచ్చి సమర్పించారు. శోభాయాత్రలో ఎస్ విహార్ అధినేత రాజులపాటి ప్రసాద్ దంపతులు, చెన్ను రంగారావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సూరగం జగన్మోహన్‌రెడ్డి, దివిసీమ ప్రఖండ అధ్యక్షుడు కమ్మిలి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారను. వై.శ్రీహరిబాబు, రాములు పర్యవేక్షించారు.

మహిళా చట్టాలపై అవగాహన ఉండాలి

బంటుమిల్లి : మహిళల చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని బంటుమిల్లి మహిళా శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు అధికారిణి సముద్రవేణి అన్నారు. బంటుమిల్లి అంగన్‌వాడీ పరిధిలో మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

చల్లపల్లి : లక్ష్మీపురం గ్రామ పంచాయతీ పరిధిలోని పుచ్చగడ్డ పోలింగ్ కేంద్రాన్ని చల్లపల్లి సీఐ సిహెచ్.నాగప్రసాద్, ఎస్సై సిహెచ్.చిన్నబాబు శనివారం పరిశీలించారు. సార్వత్రిక ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించే క్రమంలో పోలింగ్ కేంద్రాలు, ఏర్పాట్లను పరిశీలిస్తున్నట్లు సీఐ తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. ఎన్నికల అధికారుల ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు.

పామర్రు గంగానమ్మ ప్రధాన జాతర నేడు

పామర్రు : పామర్రు గంగానమ్మ జాతర వైభవంగా జరుగుతోంది. ఆదివారం జాతర చివరి రోజు కావడంతో అలయం వద్ద విస్తృత ఏర్పాట్లు చేశారు. పోలీసు శాఖ పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసింది.

చెన్న మల్లిఖార్జునస్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు

తోట్లవల్లూరు : స్థానిక భ్రమరాంబ చెన్న మల్లిఖార్జునస్వామి దేవస్థానం దేవదాయశాఖలో విలీనం అయినందున మహా శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని తహసీల్దార్ ఎం కుసుమకుమారి కోరారు. దేవస్థానంలో శనివారం సమన్వయకమిటీ సమావేశం నిర్వహించారు. 5వ తేదీ నుంచి 11వ తేదీ వరకు దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగుతాయని, 8వ తేదీన మహా శివరాత్రి పర్వదినానికి అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. దాత సహాయంతో ఆలయాలకు రంగులు వేస్తున్నారన్నారు. ఈవో సీహెచ్ హరి దుర్గా నాగేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసరెడ్డి, ఎస్సై పి విశ్వనాధ్ పంచాయితీ, రెవెన్యూ, పోలీస్, ఎస్ఈబీ, వైద్యశాఖ, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

కానూరు జడ్పీ పాఠశాలలో సరస్వతీపూజ

మచిలీపట్నం టౌన్ : విద్యార్థులు పట్టుదలతో చదవి మంచి ఫలితాలు సాధించాలని తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ అన్నారు. కానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులు శనివారం సరస్వతీ పూజ నిర్వహించారు. గోపు సత్యనారాయణ మాట్లాడుతూ, పాఠశాలకు నిధులు తీసుకువచ్చామన్నారు. పాఠశాలలో ఏదైనా సమస్య ఉంటే పరిష్కరిస్తామన్నారు. సత్యసాయి ట్రస్టు ప్రతినిధులు విద్యార్థులకు ప్యాడ్‌లు పెన్‌లు బహూకరించారు. ప్రధానోపాధ్యాయురాలు నాంచారమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

గుడివాడ : ట్రాఫిక్ నిబంధనలు పాటించి రక్షణ పొందాలని డీఎస్పీ పి.శ్రీకాంత్ అన్నారు. వీకేఆర్ వీఎన్‌బీ ఇంజనీరింగ్ కళాశాల ఎన్.ఎస్.ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్, నెహ్రూ చౌక్ సెంటర్, ఫ్లైఓవర్ ప్రాంతం, మార్కెట్, నాగవరప్పాడు, టెలిఫోన్ నగర్, జొన్నపాడు సెంటర్‌లలో సురక్షిత ప్రయాణంపై అవగాహన సదస్సులను నిర్వహించారు. కళాశాల కార్యదర్శి వేములపల్లి కోదండరామయ్య, డైరెక్టర్ బి.కళ్యాణ్‌కుమార్, డి.దిలీప్, ఎస్.నవీన్, ఎన్.ధనుంజయరావు, నవులూరి ముత్యాలు, యమ్.నరేంద్ర, డి.నిశ్చల, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు దిట్టకవి కౌన్సెలింగ్

మచిలీపట్నం టౌన్ : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శనివారం కార్పొరేటర్ రాశంశెట్టి వాణిశ్రీ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. విద్యావేత్త దిట్టకవి వెంకటేశ్వరరావు భయం వీడి పరీక్షలు ఎలా రాయాలో వివరించారు. కె సాయికృష్ణ, హెచ్ఎం వి కృష్ణమూర్తి, కారుమూరి రాజేంద్రప్రసాద్, బాబ్జీ, ఉల్లి రంగారావు, పి.వి. శ్రీనివాసరావు, కంచర్లపల్లి కృష్ణమోహన్ లంకిశెట్టి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

వాసవీ ఇంజనీరింగ్‌లో క్యాంపస్ డ్రైవ్



పెడన రూరల్ : నందమూరు వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన క్యాంపస్ డ్రైవ్‌లో 46 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కరస్పాండెంట్ కాకి కుమార్‌బాబు తెలిపారు. హైదరాబాద్ చెందిన గ్లోబల్ లాజిక్ సంస్థ నిర్వహించిన ఇంటర్వ్యూలో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ బిఆర్ఎస్ రెడ్డి, డైరెక్టర్ దోసపాటి బాబా, రఘురాం తదితరులు అభినందించారు.

కొమ్మారెడ్డి విద్యార్థిని సుమశ్రీ ప్రతిభ



బంటుమిల్లి : గోదావరి రామాయణం టాలెంట్ టెస్ట్‌లో కొమ్మారెడ్డి పాఠశాల 7వ తరగతి విద్యార్థిని సిహెచ్ సుమశ్రీ రాష్ట్ర స్థాయిలో ప్రతిభను చాటింది. డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ శ్రీమతి కేఎస్‌విజి శోభ, ఉపాధ్యాయులు సుమశ్రీని అభినందించారు.